సాక్షి కాకినాడ

సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025



పొగాకు ముంధరకొచ్చి..

పొగాకు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.. నాలుగు రోజుల నుంచి 'ధర'హాసం వచ్చింది.. మార్కెట్‌లో ధర పెరుగుతుండడంతో సాగుదారులకు లాభాలు వస్తున్నాయి.


8లో



స్వామీ.. నీ చెంత నీరేమీ!

ప్రసిద్ధి చెందిన మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం వర్షం వస్తే మురుగునీటి వెతలు ఎదుర్కొంటుంది.. శతాబ్దాల కిందట నిర్మించిన ఈ ఆలయం కొద్దిపాటి వర్షానికే నీట మునుగుతోంది.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం రాత్రి 4,21,035 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 14 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఆగమేఘాలపై యూరియా కూపన్ల పంపిణీ



సామర్లకోట సొసైటీ వద్ద కూపన్ల కోసం రాత్రి సమయంలో ఘర్షణ పడుతున్న రైతులు

సామర్లకోట: రైతులకు యూరియా కొరత ఏర్పడటంతో వైఎస్సార్ సీపీ రైతులకు అండగా ఉండాలని నిర్ణయించి మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆగమేఘాలపై యూరియా పంపిణీ చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు సామర్లకోట సొసైటీలో ఆదివారం రాత్రి ఎరువుల కోసం కూపన్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. కూపన్లు ఇస్తున్నారని తెలిసి రాత్రి సమయంలో రైతులు సొసైటీ వద్దకు పరుగులు తీశారు. కాగా కూపన్లు రాసే సమయంలో గలాటా జరిగింది. ముందు వచ్చిన వారికి అన్యాయం జరుగుతోందని, ఎకరం ఉన్న వారికి, 10 ఎకరాలు సాగు చేసే వారికీ కేవలం ఒక బస్తా మాత్రమే యూరియా ఇవ్వడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కౌలు రైతులు కూడా పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకురావలనే నిబంధన పెట్టడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు పేరు చెప్పితే ఎరువులు ఇస్తామని వ్యవసాయాధికారి వి.మురళీధర్ తెలిపారు. ఇప్పటి వరకు లేని ఎరువులు వైఎస్సార్ సీపీ ధర్నాకు పిలుపు ఇవ్వడంతో ఎలా వచ్చాయనే ప్రశ్నలు వినిపించాయి. కూపన్లు తీసుకున్న వారికి సోమవారం యూరియా ఇస్తామని సొసైటీ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తెలిపారు. ఎరువులు ఇవ్వకుండా కూపన్లు ఇవ్వడం ఏమిటనే ప్రశ్నలు వినిపించాయి.

టోకెన్ పద్ధతిలో ఎరువులు

తొండంగి: మండలంలోని రైతులకు వ్యవసాయశాఖ ద్వారా టోకెన్ల పద్ధతిలో ఎరువులు అందజేస్తున్నట్టు ఏఓ పద్మశ్రీ ఆదివారం తెలిపారు. మండలానికి తొండంగి, ఏవీ నగరం, బెండపూడి రైతు సేవా కేంద్రాలకు 20 టన్నుల చొప్పున 60 ఎరువుల బస్తాలు వచ్చాయన్నారు. ఏ.కొత్తపల్లి గ్రోమోర్‌కు కూడా 20 టన్నులు ఎరువుల బస్తాలు వచ్చాయన్నారు. కలెక్టర్, వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్వోల పర్యవేక్షణలో రైతులకు టోకెన్లు కేటాయిస్తారన్నారు. ఒక్కోటోకెన్‌కు ఒక బస్తా మాత్రమే సరఫరా చేస్తారన్నారు. ఇలా అందరి రైతులకు పరిమితంగా ఎరువుల బస్తాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే కొన్ని ఆర్‌ఎస్‌కేలకు మాత్రమే ఎరువులు రావడంతో మిగిలిన ఆర్‌ఎస్‌కే పరిధిలో రైతులకు ఎరువులు అందే పరిస్థితి లేదని ఆయా గ్రామాల బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి పార్టీ నేతల ఒత్తిడితో టోకెన్ విధానం మొక్కుబడి తంతుగానే సాగే అవకాశం ఉందని సామాన్య రైతులకు అందడం నీటి మీద రాతలేనని రైతులు ఆరోపిస్తున్నారు.

రత్నగిరికి శానిటరీ టెండరు ఖరారు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయంతో పాటు రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవాలయాలకు శానిటరీ మెటీరియల్ సహా హౌస్‌కీపింగ్ పనుల నిర్వహణకు ఈ–ప్రొక్యూర్ టెండర్‌ను తిరుపతికి చెందిన పద్మావతి హాస్పిటాలిటీ, ఫెసిసిటీస్ మేనేజ్‌మెంట్ సంస్థ దక్కించుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం జీఓ విడుదల చేసింది. ఇందుకోసం గత జూన్ 12న టెండర్ విడుదల చేయగా గత ఆగస్టులో పద్మావతి సంస్థ బిడ్ ఓపెన్ చేసింది. దీనితో అన్ని అర్హతలు ఉన్న ఆ సంస్థకు టెండర్ ఖరారు చేశారు. ఈ మేరకు ఆయా దేవాలయాలతో ఒప్పందం కుదుర్చుకుని శానిటరీ బాధ్యతలు చేపట్టాలని దేవదాయశాఖ ప్రధాన కార్యదర్శి వాడ్రేవు వినయ్‌చంద్ ఆదేశించారు. ఈ మేరకు రెండేళ్ల కాల పరిమితికి అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకాతిరుమల, విజయవాడ దుర్గగుడి, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాలలో ఆ సంస్థ పనులు చేపట్టాల్సి ఉంది. విద్యుత్ నిర్వహణ ఆ పనుల్లో తాజాగా జత చేశారు. కొత్త శానిటరీ కాంట్రాక్ట్‌లో పొందుపరచిన నిబంధనల ప్రకారం నెలకు సుమారు రూ.80 లక్షలకు పైగా పద్మావతి సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు సోమ, మంగళవారాలలో విధివిధానాలు ఆయా ఆలయాలకు రానున్నట్టు సమాచారం. 2014–19 మధ్య కాలంలో సైతం ఈ సంస్థే ఆయా టెండర్లను దక్కించుకుంది.

గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఇదే సంస్థకు..

2014–19 సంవత్సరాల మధ్య రాష్ట్రంలో పలు దేవాలయాలకు శానిటరీ టెండర్‌ను పద్మావతి సంస్థే దక్కించుకుంది. ఈ సంస్థ యజమాని భాస్కర నాయుడు టీడీపీ పెద్దలకు సన్నిహితుడు కావడమే అందుకు కారణమనే అభిప్రాయం వినిపిస్తోంది.

పాడిపోయిన సేవలు!

కాకినాడ జిల్లాలో	
రైతు సేవా కేంద్రాలు	408
ఆవులు	76, 502
గేదెలు	2,82,273
గొర్రెలు	1,01,870
మేకలు	1,41,229



కొత్తపల్లి మండలం కొండెవరంలో ప్రారంభానికి నోచుకోని రైతు సేవా కేంద్రం



వాకతిప్పలో మూతపడిన రైతు సేవా కేంద్రం

పిఠాపురం: పశు సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు అవన్నీ అరకొర సేవలకే పరిమితమయ్యాయి. గత 15 నెలలుగా మందులు అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేసుకుంటున్నారు. పశువులకు పూర్తిస్థాయిలో టీకాలు కూడా వేయడం లేదు. దాణా పంపిణీ అనేది ఒకటుండేదన్న విషయం కూడా మర్చి పోయారు. విత్తనాల కోసం పడిగాపులు, ఎరువుల కోసం ఆందోళనలు, పంటలు నష్టపోతే సాయం కోసం ఎదురు చూపులు, పశువులకు ఏ చిన్న రోగం వచ్చినా దూర ప్రాంతంలో ఉన్న పశు వైద్య కేంద్రానికి వెళ్లక తప్పని పరిస్థితులు మళ్లీ వచ్చేశాయి. వ్యవసాయమే కీలకంగా ఉన్న రాష్ట్రంలో రైతే రాజు. అటువంటి రైతును 'నాటకాలు ఆడుతున్నారు.. అడిగితే తాట తీస్తా'మంటున్నారు కూటమి నేతలు. చంద్రబాబు అయితే వ్యవసాయం దండగ అని నిస్సిగ్గుగా ప్రకటించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా కాలంలో ఆ కష్టాలు ఏమీ లేవు. విత్తు నాటిన నాటి నుంచి పంట డబ్బు చేతికి వచ్చే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంది. ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు కావాల్సిన అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి రైతే రాజు అనే నానుడిని నిజం చేశారు. నకిలీలు, దళారులు, వడ్డీ వ్యాపారుల బాధ లేకుండా అన్నీ స్వగ్రామంలోనే అందేలా చేశాయి అప్పట్లో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే). వీటి పనితీరు చూసి కేంద్ర ప్రభుత్వమే ప్రశంసించగా అనేక రాష్ట్రలు తమ రాష్ట్రాల్లో వీటిని ఏర్పాటు చేయడానికి ముందుకు రావడంతో పాటు మన ఆర్బీకేలు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు సాధించాయంటే వీటి పని తీరు ఎంత గొప్పగా ఉందో అర్థమవుతుంది. అటువంటి చరిత్ర సాధించిన రైతు సేవా కేంద్రాలను కూటమి ప్రభుత్వం చేవ లేని వాటిగా తయారు చేసిందని రైతులు విమర్శిస్తున్నారు.

పాడి రైతులకేది భరోసా?

ప్రతి ఆర్‌ఎస్‌కేల్లో 108 రకాల మందులు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం ఏ ఆర్‌ఎస్‌కేలో చూసినా పట్టుమని పది రకాల మందులు కూడా అందుబాటులో లేవు. ఏ రైతు సేవా కేంద్రంలో చూసినా 108 రకాలకు ఒకటి రెండు రకాలు మినహా మిగిలిన మందులేవీ అందుబాటులో లేవు. అలాగే పశువులకు వేసే టీకాలు కొన్నిచోట్ల కొన్ని రకాలు మాత్రమే ఉంటున్నాయి. ఏడాదిగా మందుల సరఫరా నిలిచిపోయిందని వైద్య సిబ్బంది చెబుతున్నారు. మందులు అవసరమైన వారిని మండల కార్యాలయాల్లో ఉన్న పశు వైద్య శాలలకు పంపిస్తున్నామని వెటర్నరీ అసిస్టెంట్లు చెబుతున్నారు. పాడి రైతులకు ఉపయోగ పడే మందులు లేకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశు సంరక్షణ శూన్యం

ప్రధానంగా వేసవి నుంచి వర్షాకాలం ప్రారంభంలో గేదెలు, ఆవుల్లో గొంతువాపు, జబ్బవాపు లకు మొదటి విడత టీకాలు వేయాలి. జూలైలో కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నివారణకు, గొర్రెలకు, మేకల్లో నీలి నాలుక వ్యాధి నివారణకు టీకాలు వేయాల్సి ఉంది. ఆగస్టులో సంకరజాతి ఆవుల్లో థైలీరియా వ్యాధి నివారణకు, ఆవులు, గేదెల్లో గాలి కుంట నివారణ మొదటి విడత టీకాలు వేయాలి. పశువుల్లో డయేరియా వస్తే మాత్రలు, పొట్టలో పాములు పట్టకుండా డీవార్మ్ మాత్రలు, పాలు సక్రమంగా ఇచ్చేందుకు లెఫ్ట్ డీన్ మాత్రలు, గాయాలు, పుండ్లు మానేందుకు పొటాషియం పెర్మాంగనేట్ లిక్విడ్, కడుపునొప్పి నివారణకు సిప్రొవెట్, పాలు తీసేటప్పుడు గడ్డలు కడితే సన్న కట్టు శుభ్రపరచడానికి జెంటామైసిన్, ఆహారం అరుగుదలకు ఎట్రాఫిన్, కాళ్ల వాపులకు సోడియం సిలికేట్ మందులు వాడాల్సి ఉంది. అలాగే తరచూ వచ్చే జ్వరం, అజీర్ణం, విరేచనాలు, దగ్గు, కాళ్ల నొప్పులు తదితర రోగాలకు ఇక్కడ వైద్య సేవలు అందించాలి. దూడలకు గొంతువాపు వ్యాధి టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్, పందులకు స్వైన్‌ఫ్లూ టీకాలు, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందులు ఇవ్వాలి. కృత్రిమ గర్భధారణకు ఎద సూదులు, చూలు కట్టకుంటే పరీక్షించడం వంటి సేవలు అందించాలి.

రైతు సేవా కేంద్రాల్లో ఈ సేవలేవీ పూర్తిస్థాయిలో అందడం లేదు. కానీ ఇవేమీ అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ప్రైవేటు దుకాణాల్లో రూ.వేలు ఖర్చు పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పాడి రైతులు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేసుకోవడానికి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరం, పారుడు వ్యాధి, మేత మేయకపోవడం, నులి పురుగులు, గర్భధారణ సమస్యలు తరచూ వస్తున్నాయి. వీటి కోసం నెలలో సుమారు రూ.2 వేలు వరకూ ఖర్చు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు.

ఆర్‌ఎస్‌కేల్లో అందించాల్సిన సేవలు..

పశుగ్రాస విత్తనాల పంపిణీ, సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ, మినరల్ మిక్చర్, పశు బీమా, పశు హెల్త్ కార్డులు, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, ప్రతి నెలా పశు విజ్ఞాన కార్యక్రమాలు, పశువులకు టీకాలు, గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు, చిటిక వ్యాధి, బ్రూసెల్లా వ్యాధి, కొక్కెర వ్యాధి, నీలి నాలుక తెగులు వంటి వ్యాధులకు టీకాలు, డీవార్మింగ్, నట్టల నివారణ కార్యక్రమాల నిర్వహణ. అన్ని రకాల జంతువులకు వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణ, నిర్ధారణ, పునరుత్పత్తి, సంతానోత్పత్తి వంటి పశు వైద్య సేవలు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా తులసీ కుమార్



పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంటు) నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్‌ను అనపర్తి నియోజకవర్గానికి నియమించారు. ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయ కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మురళీకృష్ణంరాజుకు వైఎస్సార్ సీపీ నేతల సంఘీభావం



ముదునూరికి, ఆయన తండ్రి రామరాజుకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నరసాపురం నియోజకవర్గ పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజుకు ఆదివారం ప్రత్తిపాడు అసెంబ్లీ, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి సంఘీభావం తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జి కర్రి జయసరిత, నరసాపురం జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, అమలాపురానికి చెందిన రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి బాబి తదితరులు తరలివచ్చి మురళీ కృష్ణంరాజుకు, ఆయన తండ్రి రామరాజుకు సంఘీభావం తెలిపి మద్దతుగా నిలిచారు. కూటమి ప్రభుత్వం రామరాజుపై అక్రమ కేసు పెట్టడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడ ప్రజల ఆదరణ మరువలేనిది



తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్న వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సభ్యులు

ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి

బోట్‌క్లబ్: కాకినాడ ప్రజల అదరాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 25 ఏళ్ల క్రితం కాకినాడకు ఒక నాటిక రాసేందుకు వచ్చానని అప్పుడు ఎంత అభిమానం చూపారో ఇప్పుడూ అదే అభిమానం చూపిస్తున్నారన్నారు. కళాకారులు చప్పట్లు మాత్రమే కోరుకుంటారని, నాటక రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న యంగ్మెన్స్ హ్యాపీక్లబ్ సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం బామ్మాయణం, సన్యాసి నవ్వాడు, భార్యా బాధితుల సంఘం నాటికలు ఆద్యంతం ప్రేక్షకులను అలరించాయి. వంగూరి ఫౌండేషన్‌ను స్థాపించి తెలుగు సాహిత్యం కోసం పాడుపడుతున్న వంగూరి చిట్టెన్ రాజును ఆయన అభినందించారు. యంగ్మెన్స్ దంటు భాస్కర్రావు, కె.కృష్ణారావు, మార్ని జానకిరామ చౌదరి, సుచిత్రమూర్తి, పి.ప్రభుదాసు పాల్గొన్నారు.

జిల్లాలో ఆలయాల మూసివేత

అన్నవరం/తుని రూరల్/సామర్లకోట: సంపూర్ణ చంద్రగ్రహణం వల్ల జిల్లాలోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సోమవారం ఉదయం ఆలా ఆలయ ప్రాంగణాల్లో సంప్రోక్షణల అనంతరం వివిధ సమయాల్లో దర్శనాలు కల్పించనున్నారను. అన్నవరం సత్యదేవుని ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటిగంటకు మూసివేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు సత్యదేవుడు, అమ్మవారికి హారతి ఇచ్చి ఫలహారాలు నివేదిన చేసిన అనంతరం ఆలయ తలుపులు మూసి వేశారు. ఈఓ వీర్ల సుబ్బారావు, ఏఈఓ పెండ్యాల భాస్కర్, ఇతర అధికారులు, వైదిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం ఒంటి గంట వరకు స్వామివారి దర్శనానికి అనుమతించారు. కాగా సోమవారం ఉదయం ఆలయంలో సంప్రోక్షణ అనంతరం ఏడు గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు.



అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం తలుపులు మూసివేస్తున్న అర్చకులు, అధికారులు



తలుపులమ్మ ఆలయం మూసివేత..



సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయం వద్ద..

తలుపులమ్మతల్లి ఆలయాన్ని..


తుని రూరల్ మండలంలోని తలుపులమ్మ ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1.30 వరకు నాలుగు వేల మంది దర్శించుకున్నారని, అనంతరం ఆలయాన్ని మూసివేశామని ఈఓ పెన్మత్స విశ్వనాథరాజు తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం 8.30 గంటలకు దర్శనాలకు అనుమతిస్తామని ఆయన తెలిపారు. వివిధ మార్గాల ద్వారా మొత్తం రూ.1,32,715 ఆదాయం సమకూరినట్టు ఈఓ వివరించారు.

పంచారామ క్షేత్రంలో..

అలాగే పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని మధ్యాహ్నం 12 గంటలకు మూసివేశారు. ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని పూజలు అభిషేకాలు నిర్వహించినట్టు అభిషేక పండితులు వేమూరి సోమేశ్వర శర్మ తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం 9 గంటలకు సంప్రోక్షణ అనంతరం తెరవనున్నట్టు ఆయన తెలిపారు. స్థానిక మాండవ్య నారాయణ స్వామి ఆలయాన్ని సైతం 12 గంటలకు మూసివేశామని, తిరిగి సోమవారం ఉదయం 11 గంటలకు తెరవనున్నారు.

క్షణికావేశం.. తీరని శోకం

- ఒత్తిడిని అధిగమించలేక ఆత్మహత్యలు
- సమస్య ఏదైనా చావు పరిష్కారం కాదు
- ఆలోచిస్తే పరిష్కారం లభిస్తుందంటున్న నిపుణులు
- 10న ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవం



రాయవరం: సరిగ్గా చదవడం లేదని తండ్రి మందలించాడన్న కారణంతో మండలంలోని పసలపూడి శివారు సర్వారాయతోటలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి చెప్పిన మాటలను అర్థం చేసుకుని, ఆలోచించి ఉంటే జీవితం నిలబడేది. భర్త బలవన్మరణాన్ని తట్టుకోలేక కాకినాడకు చెందిన మహిళ జీవితంపై విరక్తితో జూలై 31న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తను లేకుంటే కుమారుడి పరిస్థితి ఏమవుతుందోనని భావించి కుమారుడికి కూడా పురుగుల మందు పట్టించింది. దీంతో ఇరువురు చికిత్స పొందుతూ తనువు చాలించారు.

ఇలా ప్రతిరోజూ చిన్న చిన్న సమస్యలకే పరిష్కార మార్గాలను అన్వేషించకుండా చావుతో ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొందరు, వ్యసనాలకు బానిసలై మరికొందరు, బాధ్యతలు మోయలేక ఇంకొందరు, పంట చేతికి రాకున్నా.. పరీక్షల్లో తప్పినా.. ప్రేమ విఫలమైనా.. పెద్దలు కోప్పడినా కూడా మరణమే శరణ్యమంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సమస్య ఎంత జటిలమైనా ఒక్క క్షణం పాటు ఆలోచిస్తే.. పరిష్కార మార్గమో.. ప్రత్యామ్నాయమో కనిపిస్తుందని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. తమపై ఆధారపడ్డ వారి గురించి.. బంధువులు, ఆత్మీయుల గురించి ఆలోచిస్తే ఆత్మహత్య ఆలోచన నుంచి మనసు మారే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

ప్రధానంగా రెండు కారణాలు

చావుకు టాప్–10 కారణాల్లో ఆత్మహత్య కూడా ఒకటి. యువతీయువకుల్లో ఆత్మహత్యలు టాప్–3లో ఉంటాయి. వీరిలో ఆత్మహత్యలు చాలా కామన్‌గా ఉంటాయి. ఆత్మహత్యలకు పైకి కన్పించే కారణాలు, కన్పించని కారణాలు ఉంటాయి. ప్రేమవివాహాలు, ఆర్థిక పరిస్థితులు, మానవ సంబంధాలు తదితరాలతో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, కొంతమందికి కన్పించని కారణాలు ఉంటాయి. మెదడులో శిరోతోనిన్ అనే జీవరసాయన పదార్థంలో చోటుచేసుకునే మార్పుల కారణంగా కొందరు ఆత్మహత్యలు చేసుకుంటారు. కొంతమంది చనిపోవడానికి నిర్ణయించుకుని చనిపోయిన వారు కొందరైతే, నేను ఎంత బాధపడుతున్నానో.. నువ్వు అర్థం చేసుకోలేకపోతున్నావు అనే మెసేజ్‌ను ఇవ్వడానికి కొంతమంది ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుంటారు. ఆ విధంగా తమకు కావలసిన వారిలో సానుభూతి రప్పించడం కోసం ఆత్మహత్యలు చేసుకుంటారు. నిజంగా ఆత్మహత్యలు చేసుకునే వారి కంటే ఇటువంటి వారు ఐదు రెట్లు ఎక్కువగా ఉంటారని మానసిక వైద్యులు చెబుతున్నారు.

కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా చికిత్స

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం ఏరియా ఆస్పత్రిలో మానసిక రుగ్మతలతో బాధపడే వారి కోసం కౌన్సెలింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్‌కు ఎక్కువగా మానసిక సమస్యలతో బాధపడేవారు వస్తున్నారు. రోజుకు 20 నుంచి 30 మంది వరకు నెలకు సుమారుగా 500 నుంచి 600 మంది వరకు కౌన్సెలింగ్ పొందుతున్నట్లు ఏరియా ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు కూడా వారికి తెలియకుండానే ఆత్మహత్యలకు పాల్పడుతుంటారని సైక్రియాటిస్టులు చెబుతున్నారు. కేవలం చిన్న చిన్న కారణాలకు, ఒత్తిడిని భరించలేని స్థితిలో విద్యార్థులు, మహిళలు ఎక్కువగా ఆత్మహత్యే శరణ్యమని భావిస్తున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఒత్తిడిని ఎదుర్కొంటున్న వారిని ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పిస్తే ఆత్మహత్యలను నివారించవచ్చని సైక్రియాటిస్టులు చెబుతున్నారు. ఆత్మహత్యకు పాల్పడడానికి ప్రధానంగా ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు, వ్యసనాలకు బానిస కావడం, పరీక్షలు, ఓటమి భయం, ఒంటరితనం, సర్దుబాటు సమస్యలు, కుటుంబ సమస్యలు, అప్పులు తదితర కారణాలన్నీ ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్నాయి. మానసిక సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చేందుకు ఇష్టపడని వారు 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి బేసిక్ కౌన్సెలింగ్‌ను పొందే వీలుంది.

పురుషులే అధికం

ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో పురుషుల మరణాలే అధికంగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. 52.8 శాతం మంది పురుషులు, 47.1 శాతం మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం. 33.3 శాతం మంది దిగులు, ఇతర కారణాలు, 10.6 శాతం పరీక్షలు, పని ఒత్తిడి, ప్రేమ విఫలం తదితర ఒత్తిడి కారణంగా, 11.4 శాతం మంది నిద్రలేమి కారణంగా, 10.6 శాతం మంది భయం, కంగారు తదితర కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 3.6 శాతం ఆత్మహత్యలు 12 సంవత్సరాల లోపు వారు, 6.3 శాతం మంది 13–17 సంవత్సరాల మధ్య వయస్సు వారు, 67.6 శాతం మంది 18–45 సంవత్సరాల వారు, 17.4శాతం మంది 46–64 మధ్య వయస్సు వారు, 5.1 శాతం మంది 65 ఏళ్ల పైబడిన వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లుగా సర్వేలు చెబుతున్నాయి.

ఒక్క క్షణం ఆగితే ప్రపంచం మీదే



చనిపోయినంత మాత్రాన సమస్య తీరదు. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది. బాధ్యతలు మోస్తున్నప్పుడు సమస్యలు రాక మానవు. అలాంటి సమయంలో ఇతరుల నుంచి సహాయాన్ని తీసుకోవాలి. సమస్య పరిష్కారానికి అన్ని మార్గాలను అన్వేషించాలి. ఆత్మహత్యలకు పాల్పడడం పిరికితనమే. ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచన వచ్చినప్పుడు ఒక్క నిమిషం ఆగితే ప్రపంచం మీదే.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

మానసిక సమస్యలతోనే ఆత్మహత్యలు



ఆత్మహత్యాయత్నం ఓ మానసిక సమస్య. ఆత్మహత్యకు పాల్పడే వ్యక్తి ముందు ఒంటరితనాన్ని కోరుకుంటారు. తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతారు. అటువంటి వారిని ముందుగా గుర్తించి చికిత్స చేయించడం అత్యవసరం. వారిని నెమ్మదిగా నలుగురిలోకి తీసుకువెళ్లాలి. జీవితంపై ఆసక్తి కలిగించేలా చూడాలి. అప్పుడే ఆత్మహత్య ఆలోచనను దూరం చేయవచ్చు.

– డాక్టర్ సౌమ్య, సైక్రియాటిస్ట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

గడ్డి మందు తాగి ఆత్మహత్య



సోమేష్ (ఫైల్)

అంబాజీపేట: గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కె.పెదపూడికి చెందిన దంగేటి సోమేశ్వరరావు అనే సోమేష్ (44) పాత్రికేయుడిగా ఉన్నారు. అతను స్థానికంగా ఉన్న కొబ్బరి తోటలో గడ్డి మందు తాగి ఉండటాన్ని స్థానికులు, బంధువులు గుర్తించారు. వెంటనే సోమేష్‌ను అతని కుటుంబ సభ్యులు అంబాజీపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతని బంధువులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై కె.చిరంజీవి వివరించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పిఠాపురం: చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. దుర్గాడకు చెందిన బొమ్మిడి వెంకటేష్ (25)కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. అతను వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 6న మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం దుర్గాడ కొత్త చెరువులో వెంకటేష్ మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లినప్పుడు కాలుజారి చెరువులో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. దీనిపై గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు ముంధరకొచ్చి..

- పొగాకు పంటకు మంచి రోజులు
- రైతుల మోములో ఆనందం
- కిలో గరిష్ఠ ధర రూ. 376



దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు ఈ-వేలం

దేవరపల్లి: పొగాకు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.. నాలుగు రోజుల నుంచి 'ధర'హాసం వచ్చింది.. మార్కెట్‌లో ధర పెరుగుతుండడంతో పొగాకు పంట పండింది.. రెండేళ్లుగా ఈ సాగు లాభసాటిగా ఉండడంతో అధిక శాతం రైతులు పంట వేశారు. మొన్నటి వరకూ కిలో గరిష్ఠ ధర రూ. 350 పలకగా, నాలుగు రోజుల నుంచి అంచెలంచెలుగా పెరుగుతోంది. శనివారం మార్కెట్లో కిలో రూ. 376 పలికింది. ఈ నెల 2న కిలో గరిష్ఠ ధర రూ. 350 ఉండగా, 3న రూ.362, 4వ తేదీన రూ. 375, 6వ తేదీన రూ.376 పలికింది. గరిష్ఠ ధరతో పాటు కిలో సగటు ధర కూడా పెరిగింది. సగటు ధర రూ. 299 పలికింది. దేవరపల్లి వేలం కేంద్రంలో గరిష్ఠంగా రూ.310 ధర పలికింది. గరిష్ఠ ధర రూ. 400 దాటుతుందని రైతులు ఆశిస్తున్నారు. ఒక దశలో కిలో గరిష్ఠ ధర రూ. 392 పలికిన పొగాకు కొద్ది రోజుల్లోనే పతనమై రూ. 350కు చేరింది. ఈ ధర దాదాపు 20 రోజులు నిలకడగా ఉంది. ఇంకా తగ్గుతుందని భయపడిన చిన్న రైతులు తమ వద్ద ఉన్న పొగాకును తక్కువ ధరకు అమ్ముకుని కొంత వరకూ నష్టపోయారు. గత ఏడాది కిలో గరిష్ఠ ధర రూ. 410, సగటు ధర రూ. 328 లభించింది. గత ఏడాది పొగాకు రైతుల ఇంట లాభాల పంట పండింది. మార్కెట్ ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి కొనసాగుతుంది.

రూ.1,683 కోట్ల పొగాకు విక్రయం

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో శనివారం నాటికి సుమారు రూ.1,683 కోట్ల విలువైన 56.29 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. 58 మిలియన్ల కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా, సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో దాదాపు 80 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి జరిగినట్టు అధికారుల అంచనా. ఇప్పటి వరకూ 56.29 మిలియన్ల కిలోల విక్రయాలు జరగ్గా అధికారుల లెక్కల ప్రకారం మరో 32 మిలియన్ల కిలోల పొగాకు అమ్మకాలు జరగాల్సి ఉంది. బోర్డు అనుమతించిన మేరకు కోటా మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి కానున్నట్టు అధికారులు చెబుతున్నారు.

వేలం కేంద్రాల వారీగా పొగాకు కొనుగోళ్లు, గరిష్ఠ, సగటు ధరలు ఇలా..

వేలం కేంద్రం	కొనుగోలు (కిలోలు)	గరిష్ఠ ధర (రూ.లలో)	సగటు ధర (రూ.లలో)
దేవరపల్లి	97,96,452	375.00	310.73
జంగారెడ్డిగూడెం-1	1,20,41,603	376.00	298.07
జంగారెడ్డిగూడెం-2	1,19,41,952	375.00	295.73
కొయ్యలగూడెం	1,18,98,189	375.00	296.64
గోపాలపురం	1,06,20,567	375.00	300.05

ఆశాజనకంగా దిగుబడులు

ఈ ఏడాది పొగాకు నాణ్యతతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరమైన నాణ్యత గల పొగాకును ఇక్కడి రైతులు పండించారు. ఎకరాకు 10 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. దీంతో మార్కెట్లో ఎన్‌ఎల్‌ఎస్ పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఎగుమతి ఆర్డర్లు ఆలస్యంగా రావడంతో కొంతకాలం మార్కెట్ ఒడిదొడుకుల్లో కొనసాగినప్పటికీ ప్రస్తుతం కోలుకుని రైతులకు అనుకూలమైన మార్కెట్ నడుస్తుంది.

4.42 లక్షల బేళ్ల కొనుగోలు

ఎన్‌ఎల్‌ఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల్లో మార్చి 24న ప్రారంభమై శనివారానికి 133 రోజులు కొనుగోళ్లు జరిగాయి. 4,42,476 పొగాకు బేళ్లు కొనుగోలు చేశారు. 13 కంపెనీలు వేలంలో పాల్గొంటున్నాయి. రోజుకు సుమారు 2.60 లక్షల కిలోల పొగాకు విక్రయాలు జరుగుతున్నాయి.

అనుమతి మేరకే పండించాలి



పొగాకు బోర్డు అనుమతి మేరకు పంట పండించాలి. 2025–26 పంట కాలానికి బోర్డు నిబంధనలను కఠినతరం చేసింది. బ్యారన్‌కు 35 క్వింటాళ్ల పంట ఉత్పత్తికి అనుమతి ఉంది. ఎన్‌ఎల్‌ఎస్ ప్రాంతంలో 49 మిలియన్ల పొగాకు ఉత్పత్తికి బోర్డు నిర్ణయించింది. వచ్చే పంట కాలంలో రైతులు విధిగా పంట నియంత్రణ పాటించి, నాణ్యతపై దృష్టి పెట్టాలి. పరిమితికి లోబడే పొగాకు సాగు చేయాలి.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్, రాజమహేంద్రవరం

టేకు రథంపై సత్యదేవుని ఊరేగింపు



టేకు రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

అన్నవరం: రత్నగిరి వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని టేకు రథంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి అర్చకుడు దత్తాత్రేయశర్మ తదితరులు పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరాగా మూడు సార్లు ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించి తిరిగి ఆలయానికి చేర్చారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదాన కార్యక్రమానికి రాజమహేంద్రవరానికి చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. రాజమహేంద్రవరం సత్యనారాయణపురానికి చెందిన కె.సతీష్‌కుమార్ ఆలయ అధికారులను కలసి ఈ విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను బహూకరించారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక



ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ డీఎస్‌ఏలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. దీనిని జిల్లా అథ్లెటిక్స్ సంఘ సభ్యుడు సాయి, రిటైర్డ్ కోచ్ కొండలరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అండర్-14, 18 బాలుర, బాలికల విభాగ ఎంపికలకు 250 మంది హాజరయ్యారు. వీరికి రన్స్, జంప్స్, త్రోస్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన 35 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరు ఈ నెల 25 నుంచి 27 వరకూ ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. పీడీలు బంగార్రాజు, నూకరాజు, త్రిపుల, హరిబాబు, వీరబాబు, డీఎస్‌ఏ కోచ్‌లు ప్రవీణ్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఎనిమిది గొర్రెల మృతి



ఏడీబీ రోడ్డులో మృతి చెందిన గొర్రెల మంద

పెద్దాపురం: అతి వేగంగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో గొర్రెల మంద మృతి చెందిన సంఘటన ఆదివారం పెద్దాపురం ఏడీబీ రోడ్డులో చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళ్తున్న కారు వేగంగా వస్తూ స్థానిక వెంకటేశ్వర పౌల్ట్రీ సమీపంలోని రోడ్డుపై వెళ్తున్న గొర్రెల మందను ఢీకొంది. ఈ ప్రమాదంలో గండేపల్లి మండలం సూరంపాలెం వాసి కొరికట్ల సుబ్బారావుకు చెందిన ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. కారు డ్రైవర్‌ను పెద్దాపురం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

షోడశ సంస్కారాలతో మానవ జన్మ పరిపూర్ణం



వేదికపై ఆశీనులై సంస్కారాల విశిష్టతను వివరిస్తున్న వేద ఘనపాఠీలు

అమలాపురం టౌన్: సనాతన భారతీయ విధానంలో షోడశ సంస్కారాలు మానవ జీవనంలో ప్రధానంగా నిలిచాయని విజయనగరం శ్రీవిద్యా పీఠం అధ్యక్షుడు యనమండ్ర సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. ఆదివారం అమలాపురం ఆపస్తంబ పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో స్మార్తాపర విద్వత్సభ స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో జరిగింది. పరిషత్ స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్వత్సభ రజతోత్సవ సభ నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా మావుళ్లమ్మ దేవస్థానం ఆస్థాన వేద పండితుడు యావని రామచంద్ర సోమయాజి ఘనపాఠి అధ్యక్షతన జరిగిన ఆపస్తంబ పురోహిత సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 150 మందికి పైగా పురోహితులు హాజరయ్యారు. 16 విధాలైన షోడశ సంస్కారాల ద్వారా మానవ జన్మ పరిపూర్ణం అవుతుందని సుబ్రహ్మణ్యశర్మ స్పష్టం చేశారు. అలాంటి ప్రధాన సంస్కారాలను నిర్వహిస్తూ సమాజాన్ని సన్మార్గంలో నడిపించే వారే పురోహితులన్నారు. పురోహిత్యం అనేది నిబద్ధత, త్రికరణశుద్ధితో నిర్వహించాల్సిన వృత్తి అని పేర్కొన్నారు. సంస్కారాలు చేయించుకునే యజమాని క్షేమం కోరుతూ కర్మలు చేయాలని పురోహితులకు వేద ఘనపాఠీలు సూచించారు. పురోహితులు సమాజంలో మనుషులకు నిర్వహించే సంస్కారాలు, కర్మ కాండల సమయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. జ్యోతిష పండితుడు చింతామణి సిద్ధాంతి మాట్లాడుతూ జ్యోతిషపరమైన విశేష అంశాలను వివరించి ముహూర్తం విలువ, విశిష్టతను తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 14 మంది విద్యార్థులకు స్మార్త పరీక్షలను ప్రథమ, ద్వితీయ కక్ష్యలతో నిర్వహించారు. పరీక్షాధికారులుగా స్మార్త పండితులు రాళ్లపల్లి సూర్య సుబ్రహ్మణ్యశర్మ, మంగిపూడి చైతన్యశర్మ వ్యవహరించారు. సభకు హాజరైన ప్రతి పురోహితునికి 10 గ్రాముల వెండి ప్రతిమను అందించారు. ఆపస్తంబ పురోహిత పరిషత్ వ్యవస్థాపకులు తోపెల్ల రామం, శ్రీపాద కరుణేందు మౌళి చిత్రపటాలకు, ఆపస్తంబ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి సభను ప్రారంభించారు. పరిషత్ కార్యదర్శి ఆకొండి పవన్‌కుమార్, కోశాధికారి ఆకెళ్ల రాజబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో పరిషత్ సభ్యులు మరువాడ వెంకన్న, తోపెల్ల చంటి, కర్రా శివయ్య, మూల పళ్లయ్య, పెద్దింటి కృష్ణ, కప్పగంతులు రాము, అనుపిండి మూర్తి, తోపెల్ల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. చివరిగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన పురోహితులను ఘనంగా సత్కరించారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక



స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఎన్జీఓ హోమ్‌లో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా శాఖ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. మూడేళ్ల కాల పరిమితికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేజీకే మూర్తి, జనరల్ సెక్రటరీగా కర్రి లక్ష్మీనరసింహారెడ్డి (కేఎల్ఎన్ రెడ్డి), కోశాధికారిగా పామర్తి గోపాలరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండీ అక్బర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ జార్జిలతో కూడిన కార్యవర్గం ఎన్నికైంది. వీరితో పాటు జిల్లాలోని వివిధ యూనిట్ల నుంచి ఎన్నికైన ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



హైడ్రాలిక్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ మురళి, పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ బ్రాంచ్ విద్యార్థుల కోసం రూ.2.5 లక్షల విలువైన హైడ్రాలిక్ ల్యాబ్‌కు సంబంధించిన 5 మెషీన్లను పూర్వ విద్యార్థులు బహూకరించారు. ఆదివారం హైడ్రాలిక్ ల్యాబ్‌ను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మురళి ప్రారంభించగా ఆయనకు మెషీన్లు అందజేశారు. ముందుగా పూర్వ విద్యార్థులు ప్రిన్సిపాల్‌తో పాటు కంప్యూటర్, మెకానికల్, ఎలక్ట్రానిక్ బ్రాంచ్ హెడ్‌లను కలసి కళాశాల అభివృద్ధిపై చర్చించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోరుగడ్డ జోసఫ్, కోశాధికారి కొంబత్తుల శ్రీనివాస్, సెక్రటరీ మేరుగ రత్నకిశోర్ మాట్లాడుతూ 2015లో రూ.2 లక్షలతో ఆర్వో ప్లాంట్, 2022లో ఎలక్ట్రానిక్స్ లాబ్స్‌కు వాటర్ లీకేజీ రాకుండా రూ. 3 లక్షలతో రూఫ్ టాపింగ్ చేశామని, నాలుగు నెలల క్రితం హాస్టల్ విద్యార్థుల కోసం చపాతీ/పూరీ మేకర్ ఇచ్చామన్నారు. పూర్వ విద్యార్థులు రాజకుమార్, కృపారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లి సాహిత్యం అందరికీ ఆదర్శం



రెంటాల శ్రీవేంకటేశ్వరావుకు పురస్కారం అందిస్తున్న అద్దేపల్లి కుటుంబ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అద్దేపల్లి రామ్మోహన రావు సాహిత్యం అందరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో ఆదివారం రాత్రి ప్రముఖ కవి అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కారం 2025ను రాజమహేంద్రవరానికి చెందిన రెంటాల శ్రీవేంకటేశ్వరరావుకు ప్రదానం చేశారు. వయో భేదం లేకుండా ప్రతి ఒక్కరినీ సాహిత్యంలో ప్రోత్సహించిన గొప్ప సాహితీవేత్త అద్దేపల్లి అని రాజమహేంద్రవరానికి చెందిన ఎస్ఆర్ పృథ్వీ అన్నారు. మధునాపంతుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ తన సాహిత్యంలో ప్రతిధ్వనింపజేశారన్నారు. పురస్కార గ్రహీత రెంటాల శ్రీవేంకటేశ్వరరావు మాట్లాడుతూ గజల్స్‌ను అర్థవంతంగా పాడి కొత్త ఒరవడికి అద్దేపల్లి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా శ్రీవేంకటేశ్వరరావు దంపతులకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా వచన కవిత పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అద్దేపల్లి ప్రభు, అద్దేపల్లి రాధాకృష్ణ, వాడ్రేవు వీరలక్ష్మి, గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామీ.. నీ చెంత నీరేమీ!



మురమళ్ల వీరేశ్వరస్వామి గర్భ గుడిలో స్వామివారి చెంతన వర్షపునీరు (ఫైల్)

- ముంపు నీట మురమళ్ల వీరేశ్వరుని ఆలయం
- ముందుకు కదలని ఆలయ పునర్నిర్మాణ పనులు
- రూ.4.50 కోట్లు మంజూరైనా మొదలు కాని వైనం



ఆలయ ప్రాంగణం చుట్టూ చేరిన వర్షపు నీరు (ఫైల్)



ముంపు నీటిలో మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారి

ఐ.పోలవరం: ప్రసిద్ధి చెందిన మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం వర్షం వస్తే ముంపునీటి వెతలు ఎదుర్కొంటుంది.. శతాబ్దాల కిందట నిర్మించిన ఈ ఆలయం కొద్దిపాటి వర్షానికే నీట మునుగుతుంది. ఈ ఆలయ పునర్నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరైనా గ్రహణం వీడడం లేదు. ఈ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని భక్తులు ఎదురు చూస్తున్నారు. నిత్యం వందలాది మంది భక్తులు కల్యాణాలకు, దర్శనాలకు వచ్చే వస్తుంటారు. మహాశివరాత్రి వంటి పర్వదినాల్లో ఇక భక్తజన కోలాహలమే. ఇక్కడి సమస్యలపై పాలకులు, అధికారులు స్పందిస్తున్న తీరును వారు తప్పుపడుతున్నారు.

వృద్ధ గౌతమీ గోదావరి నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం ప్రముఖ శైవ క్షేత్రంగా పేరొందింది. పెళ్లికాని వారు ఇక్కడ కల్యాణం చేయించుకుంటే వివాహం జరుగుతోందని నమ్మకం. దీంతో ప్రతి రోజూ ఇక్కడ 116 కల్యాణాల వరకూ జరుగుతున్నాయి. ఇది కాకుండా మహాశివరాత్రి, బ్రహ్మోత్సవాలు, లక్ష రుద్రాక్ష పూజలకు 20 వేల మంది నుంచి 30 వేల మంది వరకూ భక్తులు వస్తుంటారు. ఇక పుష్కరాల సమయంలో భక్తుల తాకిడి అధికం. సమీపంలోని వృద్ధ గౌతమీ నదీపాయలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారు.

పనులు ఎప్పుడో..!

ఇంతటి ప్రాముఖ్యం ఉన్న స్వామి ఆలయ పునర్నిర్మాణం ఎప్పుడో అర్థం కావడం లేదు. కొద్దిపాటి వర్షానికి ఇప్పుడున్న ఆలయం జలాశయాన్ని తలపిస్తోంది. ఆలయం చుట్టూ మోకాలు లోతు నీరు రావడంతో పాటు గర్భ గుడిలోకి సైతం నీరు చేరుతోంది. ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి సైతం వర్షాలకు మునుగుతుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా చెప్పాలంటే ఈ నైరుతి సీజన్‌లో చెప్పుకొనే స్థాయిలో వర్షాలు లేవు. అడపాదడపా మాత్రమే ఒక మోస్తరు నుంచి భారీ కురుస్తోంది. ఈ వర్షానికి రోడ్డు నీట మునిగి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. భక్తుల దర్శనానికి వీలుగా ద్వారాలు వెడల్పు చేయాల్సి ఉంది. ఆలయ పునర్నిర్మాణ పనులకు రూ.4.50 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. ఈ నిధులతో ఇప్పుడున్న ఆలయాన్ని తొలగించి కొత్త ఆలయాన్ని నిర్మించాల్సి ఉంది. ఇటీవల ఈ పనులు మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు. అయితే ఇంకా పనులు మొదలు కాలేదు. ఇప్పుడే పనులు మొదలు పెట్టకుంటే పుష్కర సమయానికి పూర్తవుతోందనే నమ్మకం లేదు. వెంటనే పనులు ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



రవికుమార్‌ను కాలువ వద్ద నుంచి బయటకు తీసుకు వస్తున్న ఎస్సై రవిచంద్ర

బిక్కవోలు: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన వ్యక్తి కాలువలోకి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం బిక్కవోలులో జరిగింది. ఎస్సై వి.రవిచంద్ర కథనం ప్రకారం.. బిక్కవోలుకు చెందిన కుందేటి రవికుమార్‌కు సోనితో వివాహం జరిగింది. భర్తపై కోపంతో తన అమ్మ ఇళ్లయిన మండపేటకు సుమారు 3 నెలల క్రితం వెళ్లిపోయింది. ఆమె కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో రవికుమార్ స్థానిక బ్రిడ్జి పైనుంచి అందరూ చూస్తుండగా సామర్లకోట కాలువలోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే అదే మార్గంలో వెళ్తున్న ఎస్సై రవిచంద్ర కుమార్, ఆయన ప్రైవేట్ డ్రైవర్ గణేష్ కలసి వెంటనే కాలువ వద్దకు వెళ్లి చెట్టుకు వేలాడుతున్న అతనిని నీటిలో పడకుండా కాపాడారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్సై వివరించారు.

కృషి, పట్టుదలతో లక్ష్య సాధన



సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ర్యాంకు సాధించిన నానాజీని సత్కరించిన శ్యామ్ తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ అన్నారు. తమ వద్ద శిక్షణ తీసుకుని ఇటీవల విడుదలైన కానిస్టేబుల్, డీఎస్సీ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆదివారం కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో సత్కరించినట్లు చెప్పారు. తమ సంస్థ స్థాపించిన 25 ఏళ్లలో ఎంతో మంది నిరుపేదల కలలను నిజం చేశామన్నారు. ఇటీవల విడుదలైన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించిన నానాజీని, మహిళా విభాగంలో రాష్ట్ర మొదటి ర్యాంకు పొందిన రమ్య మాధురి, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఫలితాల్లో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించిన ఎం.అచ్చుతరావు, వారి తల్లిదండ్రులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు శైలజ, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు ఆలీ, మదీనా, శేఖర్, గణేష్, గోవర్ధన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.